యునెస్కో జాబితాలో ముడమూల్ రాళ్లు

నారాయణపేట వారసత్వ నిర్మాణాలకు గుర్తింపు

హైదరాబాద్, మార్చి 14: తెలంగాణలోని నిలువురాళ్లకు యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా తాత్కాలిక జాబితాలో చోటు లభించింది. నారాయణపేట జిల్లా కృష్ణా మండలం ముడుమూల్‌లో ఆది మానవుల ఖగోళ పరిజ్ఞానానికి నిలువెత్తు నిదర్శనంగా ఉన్న ఈ నిలువు రాళ్లకు ఈ హోదా వచ్చినట్టు పారిస్‌లోని యునెస్కో భారత దేశ శాశ్వత ప్రతినిధి బృందానికి వెల్లడించింది. అశోక శాసన ప్రదేశాలు, 64 యోగిని దేవాలయాలు సహా భారత్‌లోని ఆరు వారసత్వ ప్రదేశాలు యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఇందులో ముడుమూల్‌లోని నిలువురాళ్లకు ఈ గౌరవం దక్కింది. శిలాయగంలోనే వాతావరణ మార్పులు, రుతువులు, కాలాలను గుర్తించడానికి ఆది మానవులు వీటిని ఏర్పాటు చేసుకున్నట్టు చారిత్రక పరిశోధకులు పేర్కొంటున్నారు. ఈ నిలువు రాళ్ల శిలా యుగానికి సంబంధించిన ఆనవాళ్లని చారిత్రక పరిశోధకులు తెలిపారు. 80 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంతంలో 100 వరకు గండ శిలలు ఉండగా, ఒక్కోటి 12 నుంచి 14 అడుగుల ఎత్తు వరకు ఉన్నాయి. చిన్న చిన్న రాళ్ల మరో 2 వేల వరకు ఉంటాయి. ఆకాశంలో నక్షత్రాలను చూసి దిక్కులు, సమయాన్ని కచ్చితంగా గుర్తించేందుకు ఒక రాయిపై సప్తర్షి మండలాన్ని ఏర్పాటు చేశారు. తాత్కాలిక జాబితాలో చేర్చిన మిగతా ప్రదేశాల్లో ఛత్తీస్‌గఢ్‌లోని కంగేర్ వ్యాలీ నేషనల్ పార్క్, పలు రాష్ట్రాల్లోనిర్మించిన అశోక శాసన ప్రదేశాలు, చౌసత్ యోగిని దేవాలయాలు, ఉత్తర భారతదేశంలోని గుప్త దేవాలయాలు, మధ్యప్రదేశ్, యూపీలోని బుందేలాస్ రాజభవనాలు, కోటలు ఉన్నాయి.

ఎరుపెక్కిన చందమామ

ఈ సంవత్సరం తొలి సంపూర్ణ చంద్ర గ్రహణాన్ని అమెరికా, పశ్చిమ ఐరోపా, ఆఫ్రికా దేశాల ప్రజలు శుక్రవారం వీక్షించారు. సాధారణంగా తెలుపు రంగులో కనిపించే చందమామ గ్రహణం కారణంగా ఎరుపు రంగులో కనిపించాడు. దీన్ని బ్లడ్‌మూన్ ఎఫెక్ట్ అంటారు. కొన్ని చోట్ల పాక్షిక చంద్ర గ్రహణం కనిపించింది.

శుక్రవారం ఫ్లోరిడాలో కనిపించిన బ్లడ్ మూన్



హోలీ.. సంతోషాల ఝరి

రంగులతో మెరిసిన ముఖాలు, సంతోషాలతో కేరింతలు కొట్టిన హృదయాలతో దేశ వ్యాప్తంగా ప్రజలు హోలీ పండగను ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం అహ్మదాబాద్‌లోని స్వామి నారాయణ్ మందిరంలో జరిగిన సామూహిక హోలీ వేడుకలకు భక్తులు ఇలా పోటెత్తారు.

స్వర్ణ దేవాలయంలో ఇనుప రాడ్‌తో హల్‌చల్
ఐదుగురికి గాయాలు

అమృత్‌సర్: పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లోని ప్రసిద్ధ స్వర్ణ దేవాలయంలో శుక్రవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి ఇనుప రాడ్‌తో దాడి చేయడంతో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. గాయపడిన వారిలో ఓ వ్యక్తి పరిస్థితి ఆందోళన కరంగా ఉందని, ఆ వ్యక్తికి ఐసీయూలో చికిత్స జరుగుతోందని వైద్యులు చెప్పారు. నిందితుడికి మరొకరు సహకరించారని.. దాడికి ముందు వారిద్దరూ ఆలయంలో రెక్కీ నిర్వహించారని పోలీసులు తెలిపారు. ప్రధాన నిందితుడిని హర్యానాకు చెందిన జుల్ఫాన్‌గా గుర్తించారు. దాడిలో అతడు కూడా గాయపడ్డాడని పోలీసులు వెల్లడించారు.

తుషార్ గాంధీ అరెస్ట్‌కు డిమాండ్

తిరువనంతపురం: మహాత్మా గాంధీ ముని మనుమడు తుషార్ గాంధీని అరెస్ట్ చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. తుషార్ ఇటీవల తిరువనంతపురంలో మాట్లాడుతూ బీజేపీ, ఆరెస్సెస్ చాలా ప్రమాదకరమైన, కపటత్వం గల శత్రువులని, అవి కేరళలో ప్రవేశించాయని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పేది లేదని శుక్రవారం తుషార్ స్పష్టం చేశారు. దీంతో ఆయనను అరెస్ట్ చేయాలని బీజేపీ, ఆరెస్సెస్ డిమాండ్ చేశాయి. బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి వీ మురళీధరన్ మాట్లాడుతూ.. గాంధీ ముని మనవడు తుషార్ చాలా కాలం నుంచి తన ముత్తాత పేరును వాడుకుని, లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

హెర్క్యులెస్ స్తంభాలను
ఎక్కువసేపు నిలబెట్టి..

భారతీయుడి గిన్నిస్ రికార్డు

న్యూఢిల్లీ, మార్చి 14: రెండు హెర్క్యులెస్ స్తంభాలను ఎక్కువ సేపు నిలబెట్టి భారతీయ అథ్లెట్ విస్పీ ఖరాడీ ప్రపంచ రికార్డును సాధించాడు. 2 నిమిషాల 10.75 సెకండ్ల పాటు రెండు స్తంభాలను పట్టుకుని గిన్నిస్ బుక్‌లో చోటు దక్కించుకున్నాడు. ఈ వీడియోను గిన్నిస్ బుక్ పోస్టు చేయగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రధాన సలహాదారు ఎలాన్ మస్క్ సైతం దాన్ని షేర్ చేశారు. గ్రీకు వాస్తు శిల్పాన్ని పోలిన రెండు స్తంభాలను కింద పడకుండా ఖరాడీ పట్టుకోవడం ఈ వీడియోలో కనిపించింది. స్టీల్ మ్యాన్ ఆఫ్ ఇండియా టైటిల్ గెలుచుకున్న ఖరాడీ ఖాతాలో ఇది 15వ గిన్నిస్ రికార్డు. బ్లాక్ బెల్ట్ విజేత అయిన ఖరాడీ ఐఐఎం-బీ నుంచి ఎంబీఏ డిగ్రీ పొందారు. అమెరికాలోని అంతర్జాతీయ స్పోర్ట్ సైన్స్ అకాడమీ గుర్తింపు పొందిన స్పోర్ట్స్ న్యూట్రీషనిస్టు కూడా. ఆయన స్టంట్ కొరియోగ్రాఫర్‌గా, నటుడిగా, మోడల్‌గానూ పని చేస్తున్నారు.



గ్రీన్ కార్డుతో సెటిలైపోలేరు

అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ వ్యాఖ్య ▪ కార్డుదారుల హక్కులపై కొత్త చర్చ

న్యూఢిల్లీ, వాషింగ్టన్, మార్చి 14: సంపన్న విదేశీయులకు అమెరికాలో శాశ్వత నివాసాన్ని కల్పించేందుకు మార్గం చూపించే గోల్డ్ కార్డ్ పథకాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ గ్రీన్ కార్డుదారుల హక్కులపై చేసిన తాజా వ్యాఖ్యలు కొత్త చర్చకు దారితీశాయి. శాశ్వత నివాస కార్డులుగా అధికారికంగా పిలుచుకునే గ్రీన్ కార్డులు విదేశీ జాతీయులు అమెరికాలో నివసించేందుకు, పని చేసేందుకు హక్కులు కల్పిస్తాయి. అయితే, శాశ్వత నివాసం అని పేరు పెట్టినప్పటికీ నిరవధికంగా ఉండిపోయే హక్కుగా మాత్రం పరిగణించరాదు. గ్రీన్ కార్డుదారునికి అమెరికాలో నిరవధికంగా నివసించే హక్కు ఉండబోదని వాన్స్ తాజాగా ప్రకటించారు. ఇది వాక్ స్వాతంత్ర్యానికి సంబంధించిన అంశం కాదని, ఇది తమ జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని ఆయన చెప్పారు. గ్రీన్ కార్డుదారులను తమ సమాజంలో చేర్చుకోవాలా వద్దా అన్న విషయమై అమెరికా పౌరులుగా తామే నిర్ణయిస్తామని ఆయన అన్నారు. కొన్ని అత్యవసర పరిస్థితులలో గ్రీన్ కార్డును రద్దు చేయడానికి

అమెరికా చట్టాలు అనుమతిస్తాయి. కాగా, ప్రతిపాదిత గోల్డ్ కార్డ్ కార్యక్రమం ద్వారా 50 లక్షల డాలర్లు(దాదాపు రూ.43 కోట్లు) ఫీజు చెల్లించి అమెరికాలో నివసించి, పని చేసే హక్కును విదేశీ పౌరులు పొందవచ్చు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఈబీ-5 ఇమిగ్రెంట్ ఇన్వెస్టర్ వీసా స్థానంలో ఈ పథకం రానున్నది.

జన్మతః పౌరసత్వంపై సుప్రీంకోర్టుకు ట్రంప్

జన్మతః పౌరసత్వ హక్కును కట్టడి చేయడం కోసం అమెరికా ప్రభుత్వం సుప్రీంకోర్టును గురువారం ఆశ్రయించింది. ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఆదేశాలపై వాషింగ్టన్, మసాచుసెట్స్, మేరీల్యాండ్ ఫెడరల్ కోర్టులు ఇచ్చిన ఇంజక్షన్ ఉత్తర్వుల పరిధిని ప్రభుత్వం ప్రశ్నించింది. దేశ వ్యాప్తంగా అమలయ్యేలా ఇచ్చిన ఆదేశాలను జస్టిస్(న్యాయ) డిపార్ట్‌మెంట్ సవాల్ చేసింది. ట్రంప్ ఆదేశాలను డెమొక్రటిక్ స్టేట్ అటార్నీస్ జనరల్, ఇమిగ్రేషన్ హక్కుల మద్దతుదారులు, కాబోయే తల్లులు కోర్టుల్లో సవాల్ చేశారు. అమెరికా రాజ్యాంగానికి జరిగిన 14వ సవరణను ఈ ఆదేశాలు ఉల్లంఘిస్తున్నాయని వాదించారు. అయితే, ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ ఈ 14వ సవరణను ప్రశ్నిస్తున్నది. చట్టవిరుద్ధంగా ఉంటున్న వారికి లేదా చట్టబద్ధంగా, తాత్కాలికంగా దేశంలో ఉంటున్నవారికి జన్మించిన పిల్లలకు పౌరసత్వం ఇవ్వడం ఈ సవరణ ఉద్దేశం కాదని వాదిస్తున్నది. ఈ సవరణను పరిమిత దృక్పథంతో చూడాలని, విశాల దృక్పథంతో చూడరాదని చెప్తున్నది.

అమెరికాతో చర్చల్లో 'భారత్‌కే ప్రాధాన్యం': గోయల్

వాణిజ్య ఒప్పందం కోసం అమెరికాతో జరిపిన చర్చల్లో భారత దేశానికే ప్రాధాన్యం అనే వైఖరిని ప్రదర్శించానని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం తెలిపారు. ఆయన గత వారం అమెరికాలో ఆ దేశ వాణిజ్య ప్రతినిధి జేమీసన్ గ్రీర్‌తో జరిపిన చర్చల గురించి ఎక్స్‌లో వివరించారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం దిశగా ముందు చూపుతో కూడిన ముందడుగుగా ఈ చర్చలను అభివర్ణించారు. ఇరు దేశాల మధ్య గొప్ప ఆర్థిక పరివర్తనకు వేదిక ఏర్పాటైందన్నారు. 'భారత దేశానికే పెద్ద పీట', 'అభివృద్ధి చెందిన భారత్', ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం అనేవి ఈ చర్చల్లో భారత దేశ వైఖరికి మార్గదర్శకంగా నిలిచాయని వివరించారు.

అపార్ట్‌మెంట్‌లో మంటలు
రాజ్‌కోట్‌లో ముగ్గురి మృతి

రాజ్‌కోట్, మార్చి 14: గుజరాత్‌లోని రాజ్‌కోట్ నగరంలో శుక్రవారం ఓ 12 అంతస్తుల నివాస భవనంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించి ముగ్గురు వ్యక్తులు మరణించగా ఒకరు గాయపడ్డారు. నగరంలోని 150 అడుగుల రింగ్ రోడ్డు ప్రాంతంలో ఉన్న ఈ భవనంలోపల దాదాపు 40 మంది చిక్కుకోగా వారిని కాపాడి వెలుపలికి తరలించినట్టు అధికారులు చెప్పారు. అట్లాంటిస్ అపార్ట్‌మెంట్‌లోని ఆరవ అంతస్తులో ఉన్న ఒక ఫ్లాట్‌లో ఉదయం 9.30 గంటలకు మంటలు చెలరేగినట్టు వారు తెలిపారు. మంటల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా మరో వ్యక్తి గాయపడినట్టు ఏఎస్పీ బీజే చౌదరి చెప్పారు. మధ్యాహ్నం కల్లా మంటలను అదుపులోకి తెచ్చినట్టు ఆయన చెప్పారు.

24, 25న దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మె
ఐబీఏతో చర్చలు విఫలమయ్యాయన్న నేతలు

న్యూఢిల్లీ, మార్చి 14: డిమాండ్ల సాధనకు ఈ నెల 24, 25 తేదీల్లో దేశ వ్యాప్తంగా సమ్మె నిర్వహించాలని ద యూనియన్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్ (యూఎఫ్‌బీయూ) నిర్ణయించింది. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)తో తాము జరిపిన చర్చల్లో సానుకూల ఫలితాలు రాకపోవడంతో సమ్మె చేయాలని నిర్ణయించినట్టు తెలిపింది.ఐదు రోజుల పని దినాల అమలు, అన్ని స్థాయిల్లో ఉద్యోగాలు, డైరెక్టర్ పోస్టుల భర్తీ చేపట్టాలన్నది తమ ప్రధాన డిమాండ్లని పేర్కొంది. ఈ మేరకు ఐబీఏతో జరిపిన చర్చల్లో ప్రధాన సమస్యలన్నీ అపరిష్కృతంగానే ఉండిపోయాయని నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ (ఎన్‌సీబీఈ) ప్రధాన కార్యదర్శి ఎల్ చంద్రశేఖర్ తెలిపారు. అలాగే ఉద్యోగుల పనిపై సమీక్ష, పని ఆధారిత ప్రోత్సాహకాలపై ఇటీవల ఆర్థిక శాఖ జారీ చేసిన ఆదేశాలను వెంటనే ఉపసంహరించుకోవాలని తొమ్మిది యూనియన్లతో కూడిన యూఎఫ్‌బీ యూ డిమాండ్ చేసినట్టు ఆయన చెప్పారు. ప్రభుత్వ రంగ బ్యాంకులది సూక్ష్మ నిర్వహణ అని ఆర్థిక సేవల విభాగం పిలిచే విధానాన్ని కూడా సంస్థ వ్యతిరేకించింది.

కశ్మీర్‌లో 60 మంది విదేశీ ఉగ్రవాదులు
మళ్లీ చురుగ్గా కార్యకలాపాలు

న్యూఢిల్లీ, మార్చి 14: జమ్ము కశ్మీర్‌లో ప్రస్తుతం సుమారు 60 మంది విదేశీ ఉగ్రవాదులు క్రియాశీలకంగా పని చేస్తున్నారని భారత ఆర్మీ వర్గాలు తెలిపాయి. వీరిలో అత్యధికంగా 35 మంది లష్కరే తోయిబా(లెట్) తరపున పనిచేస్తుండగా 17 మంది స్థానిక టెర్రరిస్టులు విద్రోహ కార్యకలాపాలను సాగిస్తున్నారని చెప్పాయి. జైషేకి చెందిన వారు 21 మంది, హిజ్బుల్‌కు చెందిన వారు ముగ్గురు ఈ ప్రాంతంలో చురుగ్గా తీవ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు సైన్యం తెలిపింది. 17 మంది స్థానిక తీవ్రవాదులలో 14 మంది శ్రీనగర్ లోయలో, మిగిలిన వారు జమ్మూ సెక్టార్‌లో కార్యకలాపాలు సాగిస్తున్నారని చెప్పింది.

తమిళనాడును మోసగించిన కేంద్రం

సమగ్ర శిక్ష పథకంలో రూ.2,150 కోట్లు ఇవ్వలేదు

బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు

చెన్నై: బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తమిళనాడును మోసం చేసిందని ఆ రాష్ట్ర ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు ఆరోపించారు. 2025-26 రాష్ట్ర బడ్జెట్‌ను శుక్రవారం ఆయన శాసనసభకు సమర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై ఆయన విరుచుకుపడ్డారు. ద్విభాషా విధానం విజయవంతమైందని చెప్పారు. హిందీని రుద్దుతున్నారన్న ఆరోపణలను ఉపసంహరించుకునే వరకు, జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసే వరకు నిధులను విడుదల చేయబోమని ధర్మేంద్ర చెప్పారని తెన్నరసు ఆరోపించారు. దీనిని బ్లాక్‌మెయిల్‌గా సీఎం స్టాలిన్ అన్నారని, దీంతో ఇరువురి మధ్య భీకర వాగ్వాదం జరిగిందని చెప్పారు. కేంద్రం రూ.2,152 కోట్లను విడుదల చేయకుండా తమిళుల్ని మోసగించిందన్నారు. ఎన్ఈపీని అంగీకరించనందుకే ఇలా చేసిందన్నారు. ఎన్ఈపీ త్రిభాషా విధానాన్ని ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులను కేటాయిస్తున్నదన్నారు.

కారు ఢీ కొని ఆరుగురి మృతి

ఎనిమిది మందికి గాయాలు



నాదియా/వడోదర: అత్యంత వేగంగా వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న మూడు ఈ-రిక్షాలను ఢీ కొట్టడంతో ముగ్గురు మహిళలు, ఓ చిన్నారి సహా ఆరుగురు మరణించారు. ఎనిమిది మంది గాయపడ్డారు.పశ్చిమ బెంగాల్‌లోని నాదియా జిల్లా, చాప్రా ప్రాంతంలో శుక్రవారం ఈ ప్రమాదం జరిగింది. గాయపడినవారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

'మరో రౌండ్' అంటూ బైక్‌ల పైకి దూసుకెళ్లాడు!

గుజరాత్‌లోని వడోదరలో గురు-శుక్రవారాల మధ్య రాత్రి 12.30 గంటలకు ఓ కారు వేగంగా దూసుకెళ్లి, రోడ్డు పక్కన ఉన్న బైక్‌లు, పాదచారులను ఢీకొట్టింది. దీంతో స్కూటీపై వెళ్తున్న ఒక మహిళ అక్కడికక్కడే మరణించారు. నలుగురు గాయపడ్డారు. ఈ కారును నడిపిన న్యాయశాస్త్ర విద్యార్థి రక్షిత్ చౌరాసియా(20)ని స్థానికులు పట్టుకుని, దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. ఈ కారు యజమాని మీత్ కూడా అదే కారులో ఉన్నాడు. వీరిద్దరూ స్నేహితులని తెలుస్తున్నది. ప్రమాదం జరిగిన వెంటనే రక్షిత్ కిందకు దిగి 'మరో రౌండ్.. మరో రౌండ్.. ఓం నమఃశివాయ' అంటూ అరిచాడని స్థానికులు తెలిపారు. రక్షిత్‌ను పోలీసులు అరెస్ట్ చేసి, దర్యాప్తు జరుపుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో రక్షిత్ మద్యం సేవించాడా? లేదా? అనేది పరీక్షల తర్వాత తెలుస్తుందని పోలీసు అధికారి ఒకరు మీడియాకు తెలిపారు.

బాయ్‌ఫ్రెండ్స్‌తో భార్య అసభ్యకర చాటింగా?

ఏ భర్తా భరించడన్న మధ్యప్రదేశ్ హైకోర్టు



భోపాల్, మార్చి 14: భార్య తన బాయ్‌ఫ్రెండ్స్‌తో అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని ఏ భర్తా సహించడని మధ్యప్రదేశ్ హైకోర్టు వ్యాఖ్యానించింది. భార్య తీరు క్రూరత్వం కిందకు వస్తుందంటూ ఓ జంటకు విడాకులు మంజూరుచేసింది. 2018లో వివాహం చేసుకున్న ఓ వ్యక్తి, మగ స్నేహితులతో తన భార్య కొనసాగిస్తున్న సంబంధాల్ని, వాళ్లతో చేస్తున్న అసభ్యకరమైన మొబైల్ చాటింగ్‌ను కోర్టు ముందు ఉంచుతూ విడాకులు కోరాడు. దీంతో దిగువ కోర్టు విడాకులు మంజూరు చేయగా, దానిపై భార్య హైకోర్టును ఆశ్రయించింది. తాజాగా కేసును విచారిస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు తుది తీర్పు ఇచ్చింది. మగ స్నేహితులతో భార్య తన లైంగిక విషయాల్ని చాటింగ్ చేయడాన్ని ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. విడాకులు మంజూరు చేస్తూ దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. 'భార్య లేదా భర్త, బయటి వ్యక్తులతో లైంగిక విషయాలపై మాట్లాడే తీరు లేదా మొబైల్ చాటింగ్ మర్యాదగా, గౌరవప్రదంగా ఉండాలి. ముఖ్యంగా జీవిత భాగస్వామికి అది అభ్యంతరకరం కాకూడదు' అని ధర్మాసనం అభిప్రాయపడింది.

రన్యారావుకు బెయిల్ నిరాకరణ
తీవ్రమైన అభియోగాలు ఉన్నాయన్న న్యాయమూర్తి

బెంగళూరు, మార్చి 14: బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన కన్నడ నటి రన్యారావుకు ఆర్థిక నేరాలకు సంబంధించిన ప్రత్యేక కోర్టు శుక్రవారం బెయిల్ నిరాకరించింది. ఆమెపై దాఖలైన అభియోగాలు చాలా తీవ్రమైనవని, ఆమె జ్యుడీషియల్ కస్టడీలోనే ఉండాలని న్యాయమూర్తి విశ్వనాథ్ సీ గౌడర్ తెలిపారు. బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన రన్యారావు మొదట బెయిల్ కోసం మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ వేశారు. కోర్టు తిరస్కరించడంతో ఆమె ప్రత్యేక కోర్టును ఆశ్రయించగా అక్కడ కూడా ఆమె పిటిషన్ తిరస్కరణకు గురైంది. బెయిల్ కోసం సెషన్స్ కోర్టును ఆశ్రయించాలని రన్యారావు న్యాయవాదులు నిర్ణయించారు. మార్చి 4న రూ.12 కోట్ల విలువైన 14.8 కిలోల బంగారం స్మగ్లింగ్ చేస్తూ రన్యారావు కస్టమ్స్ అధికారులకు పట్టుబడ్డారు.

వేగంలో చైనా రాకెట్ స్లెడ్ రికార్డ్
విజయవంతంగా పరీక్షించిన డ్రాగన్

బీజింగ్, మార్చి 14: రాకెట్ సైన్స్‌లో చైనా అద్భుత విజయాన్ని సాధించింది. అత్యాధునిక డ్యూయల్-ట్రాక్ రాకెట్ స్లెడ్‌ను విజయవంతంగా పరీక్షించి వేగంలో సరికొత్త రికార్డు నెలకొల్పింది. అత్యాధునికమైన ఈ ట్రాక్ విమానయానంతోపాటు రోదసి, ఆయుధ రంగాలకు సంబంధించిన పరీక్షలకు ఎంతో ఉపకరిస్తుంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఈ సాంకేతికను కలిగి ఉన్న ఐదు దేశాల్లో చైనా ఒకటిగా నిలిచింది. ఆసియాలో తొలి డ్యూయల్-ట్రాక్ రాకెట్ స్లెడ్ సిస్టమ్ ఇదేనని చైనా కమ్యూనిస్టు పార్టీ అధికారిక వార్తాపత్రిక 'పీపుల్స్ డైలీ' వెల్లడించింది. 8 టన్నుల బరువైన వస్తువు వేగాన్ని ఈ ట్రాక్ కేవలం 5 సెకండ్లలో సూపర్‌సోనిక్ స్థాయికి పెంచగలదని పేర్కొంది. 6 కిలోమీటర్ల పొడవైన ఈ రాకెట్ స్లెడ్ ట్రాక్‌పై ఇటీవల ఓ ప్రొటోటైప్ ఎయిర్‌క్రాఫ్ట్ గంటకు 2,800 కి.మీ (మాక్ 2.28) వేగంతో దూసుకుపోయినట్టు తెలిపింది.

విమానంలో మంటలు..
రెక్కలపైకి ప్రయాణికులు

అమెరికాలో ఘటన.. తప్పిన భారీ ప్రాణ నష్టం

డెన్వర్, మార్చి 14: అమెరికాలోని డెన్వర్ విమానాశ్రయం నుంచి డల్లాస్ వెళుతున్న ఓ అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానంలో గురువారం చెలరేగిన మంటలు ప్రయాణికుల్ని భయకంపితుల్ని చేశాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఆరుగురు సిబ్బందితో సహా విమానంలో 178 మంది ప్రయాణికులు ఉన్నారు. సాంకేతిక లోపం తలెత్తడంతో విమానాన్ని తిరిగి డెన్వర్ విమానాశ్రయానికి మళ్లించినట్టు అమెరికన్ ఎయిర్‌లైన్స్ ప్రతినిధి తెలిపారు. విమానంలో మంటలు చెలరేగడంతో రెక్కల పైనుంచి ప్రయాణికులను బయటకు తరలించారు. ల్యాండింగ్ అయిన తర్వాత గేట్ వైపు వెళుతుండగా విమానం ఇంజిన్‌లో సమస్య తలెత్తినట్టు వార్తలు వెలువడ్డాయి. విమానంలోని ప్రయాణికులందరినీ సురక్షితంగా తరలించామని, అయితే స్వల్పంగా గాయపడిన 12 మందిని దవాఖానకు తరలించామని డెన్వర్ విమానాశ్రయం ఎక్స్‌లో వివరించింది.

పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ లైంగిక హింస!

జెనీవా, మార్చి 14: హమాస్‌తో యుద్ధం వేళ ఇజ్రాయెల్‌పై ఐక్యరాజ్య సమితి తీవ్ర ఆరోపణలు చేసింది. గాజా స్ట్రిప్‌లో యుద్ధం సందర్భంగా పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ లైంగిక హింసకు పాల్పడిందని ఐరాసకు చెందిన మానవ హక్కుల నిపుణులు గురువారం ఆరోపించారు. 'గాజా ప్రాంతంలో హమాస్‌తో జరిగిన యుద్ధంలో ఇజ్రాయెల్ లైంగిక, పునరుత్పత్తి, ఇతర లింగ ఆధారిత హింసకు క్రమబద్ధంగా పాల్పడింది' అని వారు తెలిపారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్‌లు దాడి చేసిన అనంతరం ఇంత తీవ్ర స్థాయి ఆరోపణలు ఎన్నడూ రాలేదు. అయితే ఇజ్రాయెల్ వ్యతిరేక చర్యల్లో భాగంగానే ఐరాస మానవ హక్కుల కౌన్సిల్ ఇలాంటి ఆరోపణలు చేసిందని ఆ దేశ ప్రధాని నెతన్యాహూ అన్నారు. అయితే వారు దీనిపై తాము కనుగొన్నదేమిటో వివరించ లేదని ఆయన విమర్శించారు. గాజాపై ఇజ్రాయెల్ చేసిన దాడి అనంతరం ఐరాస మానవ హక్కుల కమిషన్ యుద్ధం జరిగిన ప్రాంతాల్లో పర్యటించి, దానిపై నివేదిక సమర్పించింది.

వైఫల్యం మీదైతే.. నిందలు మా పైనా?

పాక్ వ్యాఖ్యలను ఖండించిన భారత్

న్యూఢిల్లీ, మార్చి 14: బలూచిస్తాన్ రైలు హైజాక్ ఘటన నేపథ్యంలో పాకిస్థాన్ మరోసారి భారత్‌పై నోరు పారేసుకుంది. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నదని, తెర వెనుకుండి ఉగ్రవాదానికి మద్దతు (స్పాన్సర్ చేస్తున్నదని) పలుకుతున్నదని గురువారం పాకిస్థాన్ ఆరోపణలకు దిగింది. పొరుగు దేశాలను భారత్ అస్థిరపరుస్తున్నదని, ప్రపంచవ్యాప్తంగా హత్యాకాండను నిర్వహిస్తున్నదని పాకిస్థాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి షౌకత్ అలీఖాన్ చేసిన వ్యాఖ్యలు భారత్‌ను తీవ్ర ఆగ్రహానికి గురిచేశాయి. తన వైఫల్యాల్ని కప్పి పుచ్చుకునేందుకు పాకిస్థాన్ ఇతర దేశాలపై నిందలను మోపుతున్నదంటూ భారత్ ఘాటుగా స్పందించింది. గ్లోబల్ టెర్రరిజానికి ముఖ్య కేంద్రం ఎక్కడుందన్నది ప్రపంచానికి అంత టికీ తెలుసునని పాక్‌ను పరోక్షంగా ఎత్తిపొడిచింది. గురువారం షౌకత్ అలీఖాన్ బలూచిస్తాన్ రైలు హైజాక్ ఘటనపై మీడియాతో మాట్లాడుతూ భారత్‌పై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. 'భారత్ ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదం బలూచిస్తాన్ రైలు హైజాక్ ఘటనతో ప్రత్యక్ష సంబంధముంది' అని అన్నారు. దీనిపై శుక్రవారం భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మాట్లాడుతూ, పాకిస్థాన్ చేసిన నిరాధార ఆరోపణల్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

పాక్ ఏజెంట్‌కు రహస్య డాటా చేరవేత
హనీట్రాప్ కేసులో రక్షణ ఉద్యోగి అరెస్ట్

లక్నో: ఉత్తరప్రదేశ్ ఫిరోజాబాద్‌లోని రక్షణ శాఖ ఆయుధ కర్మాగారం నుంచి రహస్య సమాచారాన్ని పాకిస్థాన్ ఐఎస్ఐ ఏజెంట్‌కు చేర వేస్తున్న ఉద్యోగి రవీంద్రకుమార్, అతడి సహాయకుడిని యూపీ ఏటీఎస్ అధికారులు అరెస్ట్ చేశారు. నిందితుడు స్పేస్ ప్రాజెక్ట్, సైన్యానికి చెందిన డ్రోన్ ప్రాజెక్టు వివరాలను పాకిస్థాన్ మహిళకు అందించినట్టు దర్యాప్తులో తేలిందని ఏటీఎస్ చీఫ్ నిలబ్జ చౌదరి వెల్లడించారు. ఐఎస్ఐ కోసం పని చేస్తున్న ఓ మహిళ నేహా శర్మ అనే మారు పేరుతో ఫేస్‌బుక్‌లో పరిచయం చేసుకుని, రవీంద్రకుమార్‌ను ట్రాప్ చేసినట్టు గుర్తించారు. ఆయుధాల తయారీకి సంబంధించిన కీలక సమాచారం చేర వేసినట్టు ఓ అధికారి చెప్పారు.

కెనడా ప్రధానిగా కార్నీ బాధ్యతల స్వీకరణ

టొరంటో: కెనడా ప్రధాన మంత్రిగా మాజీ సెంట్రల్ బ్యాంకర్ మార్క్ కార్నీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జస్టిన్ ట్రూడో ప్రధాని పదవికి జనవరిలో రాజీనామాను ప్రకటించిన సంగతి తెలిసిందే. అధికార లిబరల్ పార్టీ నూతన నేతను ఎన్నుకునే వరకు ట్రూడో ఆ పదవిలో కొనసాగారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించిన నేపథ్యంలో నూతన ప్రధాని అయిన మార్క్‌పై ప్రత్యేక బాధ్యత ఉంది. బాధ్యతల స్వీకరణ సందర్భంగా మార్క్ మాట్ల